క్లుప్తంగా

గురుకులానికి విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: పట్టణంలోని హిందూపురం రోడ్డులో సేవాభారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాధవ గురుకులానికి మేపూరి ఇన్‌ఫ్రా వెంచర్స్ అధినేత మేపూరి రాజశేఖర్‌రెడ్డి మంగళవారం రూ.10,116 విరాళం అందజేశారు. గురుకులంలో చదువుతున్న విద్యార్థులు బ్యాగులు పెట్టుకోవడానికి ర్యాక్స్ అవసరం ఉందని నిర్వాహకులు తెలపడంతో ఆయన స్పందించి ఈ ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో సేవాభారతి మాజీ కార్యదర్శి శరత్‌కుమార్‌రెడ్డి, శివప్రసాద్, గజ్జల వాసుదేవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపు తనిఖీ

నల్లచెరువు: పెద్దయల్లంపల్లిలోని రేషన్ దుకాణాన్ని మంగళవారం సీఎస్‌డీటీ అనిల్‌కుమార్ తనిఖీ చేశారు. స్టాకు, రికార్డులను పరిశీలించారు. ఆన్‌లైన్ వివరాలకు రేషన్ షాపులోని స్టాకుకు సంబంధించి ఎలాంటి వ్యత్యాసమూ లేదని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అశోక్, వీఆర్‌ఓ ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడి

తాడిమర్రి: సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడి సాధ్యమని డీఆర్‌సీ ఏడీఏ విద్యావతి రైతులకు సూచించారు. నార్సింపల్లి రైతు సేవా కేంద్రం పరిధిలోని నిడిగల్లులో రైతు ఎం.హేమంత్ సాగు చేసిన మొక్కజొన్న పంటను మంగళవారం ఆమె ధర్మవరం ఏడీఏ కృష్ణయ్య, డీఆర్‌సీ ఏఓ అబ్దుల్ అలీ, మండల వ్యవసాయ అధికారి రమాదేవితో కలసి పరిశీలించారు. మొక్కజొన్నను సాలు పద్ధతి, డ్రిప్ ద్వారా నీటి పారుదల విధానంలో సాగు చేసినట్లు గుర్తించారు. పంటను బోదె పద్ధతిలో పండిస్తే మొక్కల సాంద్రత పెంచడమే కాక నీటి వసతి, ఎరువుల వాడకం సులభతరం అవుతుందని డీఆర్‌సీ ఏడీఏ విద్యావతి తెలిపారు. అలాగే మహిళా రైతు చంద్రకళ సాగు చేసిన కందిపంటను పరిశీలించారు. మొక్క, మొక్కకు ఒక అడుగు దూరం పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంగమనాయుడు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భర్త ఆత్మహత్యాయత్నం

ధర్మవరం రూరల్: భార్యతో గొడవపడి మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్యాయత్నం చేశాడు. మల్లేనిపల్లికి చెందిన రమణ, నందిని దంపతులు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఇద్దరూ మంగళవారం గొడవపడ్డారు. మనస్తాపానికి గురైన రమణ ధర్మవరం చెరువు ఒకటో మరువ వద్దకు వెళ్లి ఊజీమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. సమీపంలో ఉన్న వారు గమనించి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు అనంతపురం తీసుకెళ్లారు.

కోటగడ్డ పెద్దమ్మకు బోనాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కోటగడ్డ పెద్దమ్మ తల్లికి ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. పూజారి రాంప్రసాద్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త పెనుకొండ నారాయణమ్మ, కమిటీ సభ్యులు కృష్ణవేణి, లక్ష్మణ్, చంద్ర, వేదప్రసాద్, లావణ్య, మల్లిక పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

పుట్టపర్తి: బుక్కపట్నం మ సర్వ సభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. అధికారులు, మండల పరిషత్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

ముగిసిన మొహర్రం వేడుకలు



తంబాపురంలో పీర్ల ఊరేగింపు

బత్తలపల్లి: మండలంలోని తంబాపురం, గంటాపురం గ్రామాల్లో మొహర్రం వేడుకలు ముగిశాయి. మంగళవారం తెల్లవారుజామునే పీర్ల స్వాములను ఆయా ప్రాంతాల్లో అగ్నిగుండ ప్రవేశం చేశాయి. సాయంత్రం జలధి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎస్‌ఐ శ్రీనివాసులు, ఏఎస్‌ఐ ఓం శేఖర్‌మూర్తి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

వైభవంగా మొహర్రం వేడుకలు

తాడిమర్రి: నిడిగల్లులో మంగళవారం మొహర్రం వేడుకలు వైభవంగా జరిగాయి. పెద్దకేశులు, చిన్న కేశులు తదితర పీర్లకు ముల్లాసాబ్ నూతన వస్త్రాలు కట్టి, వెండి గొడుగులు తొడిగి, వివిధ రకాల పుష్పమాలలతో అందంగా అలంకరించారు. సాయంత్రం 4 గంటలకు పీర్లను ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ముందుగా పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేయించారు. సాయంత్రం 7 గంటలకు పీర్లను జలధికి తీసుకెళ్లారు.

భక్తి శ్రద్ధలతో జలధికి..

చెనేకొత్తపల్లి: పలు గ్రామాల్లో మంగళవారం మొహర్రం సందర్భంగా పీర్లు జలధికి తరలాయి. స్వాములకు భక్తులు పానకాలు సమర్పించి, ప్రార్థనలు చేశారు.

కంటిమీద కునుకు కరువాయె

- ప్రజలను వేధిస్తున్న దోమల బెడద
- మున్సిపాలిటీలో కానరాని ఫాగింగ్
- దోమల నియంత్రణకు చర్యలేవీ..?



పుట్టపర్తి మున్సిపాలిటీ కార్యాలయం



పుట్టపర్తి టౌన్: ప్రస్తుతం గాలి కాలం. ఈగలు, దోమలు స్వైరవిహారంతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. దోమకాటు కారణంగా జ్వరాలు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంది. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో దోమల నివారణకు అధికారులు తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగా కనిపిస్తున్నాయి. దోమల నివారణకు గడిచిన నాలుగు నెలలుగా ఫాగింగ్ యంత్రాలు ఉపయోగించలేదు. వార్డులలో పారిశుధ్య పనులతో పాటు దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులో లేని అధికారులు

ఎన్నిల కోడ్ ముగిసి రెండు నెలలు అవుతున్నా మున్సినల్ అధికారులు మాత్రం ఇంకా ఆ మూడ్ లోనే ఉన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు దీరింది. ఎవరిని ఎక్కడకు బదిలీ చేస్తారోనన్న గందరగోళంలో ఉన్నారు. ఈ క్రమంలో ప్రజలకు అందుబాటులో లేకుండా.. సమస్యలు పట్టించుకోకుండా కావలసిన చోట బదిలీ కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరికొంత మంది అధికారులు ఫీల్డ్ పేరిట అందుబాటులో లేకుండా పోతున్నారు.

మున్సిపాలిటీ :	పుట్టపర్తి
వార్డుల సంఖ్య:	20
కుటుంబాల సంఖ్య	16 వేలు
పట్టణ జనాభా	42 వేలు

దోమల బెడద ఎక్కువైంది



గాలి కాలంలో ఈగలు, దోమల బెడద ఎక్కువైంది. రాత్రి పూట దోమలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.పారిశుద్ధ్య పనుల చేపట్టినప్పటికీ ఫాగింగ్ యంత్రాల ద్వారా దోమల నివారణకు మందులు పిచికారి చేస్తే చాలా వరకు దోమలు నివారించవచ్చు.

– వెంకప్ప, ప్రశాంతి గ్రామం

చర్యలు చేపడతాం



దోమల నివారణకు చర్యలు చేపడతాం. ఫాగింగ్ యంత్రాలు, స్ప్రేయర్ల ద్వారా వార్డులలో దోమల నివారణ మందు పిచికారి చేయిస్తాం దీనిపై కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేస్తాం.

– అంజయ్య, మున్సిపల్ కమిషనర్, పుట్టపర్తి

అధిక పాల ఉత్పత్తితో ఆర్థికాభివృద్ధి



పాడి రైతులతో మాట్లాడుతున్న పశు సంవర్ధక శాఖ జేడీ శుభదాస్

తాడిమర్రి: పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులు అధిక పాల ఉత్పత్తితో ఆర్థికాభివృద్ధి సాధించాలని పశు సంవర్ధక శాఖ జేడీ శుభదాస్ పిలుపునిచ్చారు. తాడిమర్రి పశువైద్య కేంద్రంలో మంగళవారం గోగుల్ మిషన్, పశు గణాంకాభివృద్ధి సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన పశు గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో కలసి 45 పాడి పశువులకు గర్భకోశ పరీక్షలు చేసి, చికిత్సలు చేశారు. అలాగే పలు పశువుల్లో ఎద లక్షణాలను గుర్తించి ఎద సూది ఎప్పుడు వేయించాలో పాడి రైతులకు అవగాహన కల్పించారు. జేడీ మాట్లాడుతూ పాడి రైతులు ఈ వైద్య శిబిరాలను ఉపయోగించుకుని ఎక్కువ పాల ఉత్పత్తి సాధించాలని సూచించారు. సరైన ఎదలో ఎదసూది వేయించాలని, లింగ నిర్ధారిత వీర్యం ద్వారా 90 శాతం పెయ్య దూడలు జన్మిస్తాయని పాడి రైతులకు తెలిపారు. కార్యక్రమంలో పశు గణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి డాక్టర్ సుధాకర్, ఏడీఏ శ్రీనివాసులు, తాడిమర్రి డాక్టర్ స్వర్ణలత తదతరులు పాల్గొన్నారు.

కటారుపల్లిలో భౌ‌భౌ



కటారుపల్లిలో ఆవుదూడను కరిచిన కుక్కలు



ప్రధాన వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

- కుక్కలదాడిలో మూగజీవాలు మృత్యువాత

గాండ్లపెంట: కటారుపల్లి పంచాయతీ కేంద్రంలో కుక్కల బెడద అధికమైంది. ఎప్పుడు.. ఎక్కడ చిన్నారులపైన, గొర్రెల మందపైన, ఆవులపైన దాడి చేసి గాయపరుస్తాయోనని భయపడుతున్నారు. గత నెల కటారుపల్లి గొల్లపల్లికి చెందిన ఆదెప్ప గొర్రెల మందలో ఉన్న 30 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మహబూబ్‌బాషాకు చెందిన గొర్రెలపై దాడి చేయడంతో మూడు మృతి చెందాయి. 10 రోజుల క్రితం ఈశ్వరరెడ్డికి చెందిన ఆవుదూడ కుక్కల దాడిలో మృతి చెందింది. ఇంకా ఎన్నో కోళ్లు కుక్కల బారినపడి చనిపోయాయి. కుక్కల బెడదను అరికట్టాలని పంచాయతీ అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

పారిశుధ్యం మెరుగుపై దృష్టి



డ్రెయినేజీని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ అంజినప్ప, అధికారులు

గాండ్లపెంట: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది దృష్టి సారించాలని కదిరి డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) అంజినప్ప ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ తొలుత జీనులకుంట రోడ్డు నుంచి ఏలుగూటివారిపల్లికి వెళ్లే రహదారి వరకు నిర్మించిన డ్రెయినేజీని అధికారులు, సర్పంచ్ రహంతుల్లాతో కలిసి పరిశీలించారు. కాలువ ఎత్తు పెంచి మురుగు ముందుకు సాగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం సమావేశంలో డీఎల్‌పీఓ మాట్లాడుతూ ఇంటింటి సర్వే ఎలా చేస్తున్నారని సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటిలో మరుగుదొడ్డి ఉండాలని వాటిని వినియోగంలో ఉండేలా చూడాలని అన్నారు. అదే విధంగా తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సునీత తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ పుట్టపర్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యం

పుట్టపర్తి టౌన్: స్వచ్ఛ పుట్టపర్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ అంజయ్య తెలిపారు. మంళవారం ఉదయం పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య పనులను శానిటేషన్ అధికారి సోమశేఖర్‌తో కలిసి కమిషనర్ పరిశీలించారు. అనంతరం పరిశుభ్రతపై కార్మికులకు దిశ నిర్దేశం చేశారు. సత్యసాయి బాబా మహా సమాధి దర్శనార్థం దేశ విదేశాల నుంచి భక్తులు రాకపోకలు అధికంగా ఉన్న నేపథ్యంలో పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా ఉంచాలన్నారు. ప్రజలు కూడా చెత్తను రోడ్లపైకి వేయకుండా, బుట్టల్లో చెత్త వేసి.. మున్సిపల్ వాహనాలు వచ్చినపుడు అందజేయాలని సూచించారు. హోటళ్లు, లాడ్జీల యజమానులు కూడా పరిశుభ్రత పాలించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అందరి సహకారంతో చెత్త రహిత పుట్టపర్తిగా తీర్చి దిద్దుతామన్నారు. ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజల ఫిర్యాదు మేరకు మంగళవారం ఆరో వార్డులో పైప్‌లైన్లను మరమ్మతులు చేయించి తాగునీరు కలుషితం కాకుండా చేయించామన్నారు.

ఏఎస్‌ఐ సేవలు అభినందనీయం



ఏఎస్‌ఐ నరసింహులు దంపతులను సత్కరిస్తున్న ఎస్‌ఐ ధరణిబాబు, సిబ్బంది

తనకల్లు: ఏఎస్‌ఐ నరసింహులు సేవలు అభినందనీయమని వక్తలు అన్నారు. తనకల్లు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తూ రిటైర్డ్ అయిన నరసింహులును మంగళవారం ఎస్‌ఎంఎన్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ ఏఎస్‌ఐ నరసింహులు 35 ఏళ్లుగా పోలీస్‌శాఖలో అంకితభావంతో విధులు నిర్వర్తించి అందరి మన్ననలూ పొందారన్నారు. అనంతరం ఏఎస్‌ఐ దంపతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ధరణీబాబు, రిటైర్డ్ ఎంపీడీఓ పూల నరసింహులు, ప్రిన్సిపాల్ ప్రశాంత్, పోలీస్ సిబ్బంది నాగరాజు, గౌడ్, ధనుంజయ, నారాయణస్వామి, లోకేశ్వర్‌రెడ్డి, ఆంజనేయులు, వెంటేషు, శివ, సుబ్బారెడ్డి, గౌరమ్మ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అతిగా ఎరువులు వాడొద్దు

ధర్మవరం రూరల్: అతివాడకం అనర్థదాయకమవుతుందని, మోతాదుకు మించి ఎరువులు వాడొద్దని ధర్మవరం మండల వ్యవసాయాధికారి ముస్తఫా తెలిపారు. మంగళవారం ఆయన రైతు సేవా కేంద్రం సిబ్బంది దేవికా సాయితో కలిసి రేగాటిపల్లిలో సాగవుతున్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరువుల వాడకం, నారు మడిలో సస్య రక్షణ చర్యలు తదితర వాటి గురించి రైతులకు అవగాహన కల్పించారు. 'పంటలకు ఘన, ద్రవ ఎరువులు, పచ్చిరొట్ట, పచ్చి ఆకు ఎరువులు, జీవన ఎరువులు ముఖ్య పోషకాలు. పంట ఎదుగుదలకు సుమారు 16 రకాల పోషకాలు అవసరం. వాటిలో నత్రజని, భాస్వరం, పొటాషియం ఎక్కువ మోతాదులో అవసరమవుతాయి. ఉప పోషకాలైన క్యాల్షియం, మెగ్నీషియం, గంధకం తక్కువ మోతాదులో అవసరం. ఇనుము, మాంగనీస్, రాగి, జింకు, బోరాన్, క్లోరిన్ అట్యూమినియం, నికెల్ మొదలైన సూక్ష్మపోషకాలు కూడా పంటకు తక్కువ మోతాదులోనే అవసరమవుతాయి. కానీ రైతులకు అవగాహన లేక మోతాదుకు మించి ఎరువులు వేస్తుంటారు. దీని వల్ల ఫలితం ఏ మాత్రం ఉండకపోవడంతో పాటు అదనపు ఖర్చు అవుతోంది' అని వివరించారు.

గ్రామీణ ఆస్పత్రులు అభివృద్ధి చేస్తాం

- మంత్రి సత్యకుమార్



ముదిగుబ్బ పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ముదిగుబ్బ: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వాస్పత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. మంగళవారం ముదిగుబ్బ పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. వార్డుల్లో రోగులను పలకరించి సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జనాభా ఎక్కువగా ఉన్న మండలాల్లోని పీహెచ్‌సీలను సీహెచ్‌సీలుగా మార్పు చేస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సంకేపల్లి సమీపంలో నూతనంగా నిర్మించిన వాటర్ సంపును మంత్రి ప్రారంభించారు. అలాగే ముదిగుబ్బ కేజీబీవీ కాలనీలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆదినారాయణ, బీజేపీ నాయకులు సోమల ప్రకాష్, రామకృష్ణ తదితరులు వున్నారు.

కేజీబీవీ కాలనీ సమస్యలు పరిష్కరించండి

= కేజీబీవీ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మంత్రి సత్యకుమార్‌కు సీపీఎం నాయకులు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు.

= చుక్కల భూముల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు మంత్రి సత్యకుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. నాయకులు శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలో సుమారు 15వేల ఎకరాలకు పైగా భూములు చుక్కల భూముల జాబితాలో పడ్డాయన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

ధర్మవరం అర్బన్: కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని మంత్రి సత్యకుమార్‌ను ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు కోరారు. ధర్మవరంలో మంత్రిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రికి వినతిపత్రం అందించారు.

గంగమ్మా.. కరుణించమ్మా..!



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

ధర్మవరం రూరల్: గొట్లూరులో వర్షాలు సమృద్ధిగా కురవాలంటూ మహిళలు మంగళవారం గంగమ్మ తల్లికి భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించారు. బోనాలను తలపై ఎత్తుకొని గ్రామంలో ఊరేగింపుగా డప్పు వాయిద్యాల మధ్యన గంగమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. గంగమ్మ దేవతకు విశేష పూజలు చేశారు. మహిళలు బోనాలు సమర్పించిన అనంతరం నైవేద్యాన్ని గ్రామస్తులకు పంచి పెట్టారు.

ఎస్సీ, ఎస్టీల పింఛన్లు అడ్డుకోవడం అన్యాయం

ధర్మవరం అర్బన్: అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు పింఛన్లు ఇవ్వకుండా అడ్డుకోవడం అన్యాయమని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి తెలిపారు. ధర్మవరం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నడూలేని విధంగా కూటమి అధికారంలోకి వచ్చిన తొలి నెలలోనే రాజకీయ కక్షతో ఎస్సీ, ఎస్టీల పింఛన్లు నిలిపివేశారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ ప్రాధాన్యత ఎక్కడా ఉండదని, కేవలం ఓటర్లుగా.. అనుచర వర్గంగా వాడుకుంటారని, అలాంటి వారిపై రాజకీయ కక్ష కట్టడం సరికాదన్నారు. బకాయిలతో పాటు ఆగస్టు నెల నుంచి పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఒకటో తేదీన పింఛన్ల పంపిణీకి మడకశిరకు వస్తున్న సీఎం చంద్రబాబు దృష్టికి సైతం ఈ సమస్యను అర్జీద్వారా తెలియజేసేందుకు అవకాశం కల్పించాలని కలెక్టర్‌ను కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా స్టూడెంట్ ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర అధ్యక్షుడు పాపిరెడ్డిపల్లి పృథ్వీ, విద్యార్థి నిరుద్యోగ పోరాట ఐక్య వేదిక నాయకులు వినోద్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు చిరంజీవి, రామకృష్ణ, ఓబులేసు, బాధితులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థికసాయం



నగదు అందిస్తున్న రక్తబంధం ట్రస్ట్ సభ్యులు కన్నా వెంకటేష్ తదితరులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన నీలూరి మహేష్ కుమార్తె నీలూరి లిఖిత అనారోగ్యంతో బెంగళూరు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న ధర్మవరంలోని రజిని హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్, రక్తబంధం ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో పోగు చేసిన రూ.30 వేల నగదును మంగళవారం బెంగళూరుకు వెళ్లి చిన్నారి లిఖిత తండ్రికి అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కన్నా వెంకటేష్, చంద్రశేఖర్, ఉదయ్ కుమార్, జయప్రకాష్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేద్దాం

ధర్మవరం: గ్రామస్థాయి నుంచి ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయాలని జాతీయ నాయకులు నరేంద్రబాబు తెలిపారు. పట్టణంలోని జగ్జీవన్‌రామ్ నగర్‌లోని రామాలయం వద్ద మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు త్వరలోనే వెలువడనుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాలు ఆవిష్కరించాలన్నారు.

రేపు పింఛన్ల పంపిణీ

బత్తలపల్లి: మండల వ్యాప్తంగా ఆగస్టు ఒకటో తేదీన సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొత్తం 6,392 మందికి వివిధ రకాల పింఛన్లు అందుతున్నాయన్నారు. వీరిలో 35 మంది మృతి చెందినట్లు గుర్తించామన్నారు. మిగిలిన వారికి రూ.2,77,83,500 నిధులు విడుదలైనట్లు తెలిపారు. ఆయా గ్రామాల కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాయ ఉద్యోగులు బ్యాంకుల నుంచి బుధవారం డబ్బు డ్రా చేస్తారన్నారు. లబ్ధిదారుల ఇళ్లవద్దనే పింఛన్ నగదు అందజేస్తారన్నారు.

మానవ అక్రమ రవాణా అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి

కదిరి టౌన్: మానవ అక్రమ రవాణాను అరికట్టాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయలక్ష్మి ఆదేశించారు. కదిరి బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయలక్ష్మి, మహిళా న్యాయమూర్తులు ఎస్.ప్రతిమ, పి.మీనాక్షి హాజరై మాట్లాడారు. మానవ అక్రమ రవాణా అనేది అమానవీయమని, దానిని అందరూ తుదముట్టించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లెక్చరర్ ఎం.ఎస్.ప్రశాంత్, న్యాయవాదులు లింగాల లోకేశ్వర్‌రెడ్డి, నరసింహులు, రెడ్స్ భానూజా తదితరులు పాల్గొన్నారు.

'మఠం భూమితో కేతిరెడ్డికి సంబంధం లేదు'



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి

బత్తలపల్లి: నిడిమామిడి మఠం భూమితో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డికి ఎలాంటి సంబంధమూ లేదని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పేర్కొన్నారు. మంగళవారం బత్తలపల్లిలో ఆ పార్టీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ రామ్‌భూపాల్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడి, నాయకులు వడ్డే వెంకటరాముడు, దాసరి సూరి తదితరులు విలేకరులతో మాట్లాడారు. బత్తలపల్లిలోని 401 సర్వే నంబర్‌లో గల 19.86 ఎకరాల మఠం భూమిని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, ఆయన సోదరుడు కబ్జా చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆరోపించడాన్ని తీవ్రంగా ఖండించారు. తమ పార్టీకి కానీ, నాయకులకు కానీ ఆ భూమితో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ విషయమై గతంలోనే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అనేక దఫాలుగా వివరణ కూడా ఇచ్చారని గుర్తు చేశారు. అయినా ఆయనపై విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాతనే ఆ భూమిని ఇతరులు రిజిస్ట్రేషన్ చేసుకున్న విషయాన్ని వారు గుర్తు చేశారు. తమ పార్టీ పేదలకు వ్యతిరేకంగా ఎప్పుడూ నడవలేదని, ఇది గమనించాలని అన్నారు.